షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
1 YEAR HAPPY WORK ANNIVERSARY...
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
సంపుటి : 2 సంచిక : 38 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 21 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు
VOLUME : 02 ISSUE : 38 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sutarday 21 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-

## ఏపీలో స్మగ్లర్లు
# లేకుండా చేస్తాం

- ధాన్యం సేకరణ విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని,
- ఐవీఆర్‌ఎఫ్ ద్వారా రైతుల నుంచి తానే స్వయంగా అభిప్రాయాలు సేకరిస్తా
- "ధాన్యం దిగుబడిలో మెకనైజేషన్ పెంచి రైతుల ఆదాయం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం
- దిగుబడి పెరిగి డబ్బు సకాలంలో చేతికొస్తుండటంతో రైతులు గతేడాది కంటే ఇప్పుడు సంతోషంగా ఉన్నారు
- ధాన్యం తేమ శాతం నిర్ధారణలో లోటుపాట్లు గుర్తించాం.
- అలా చేస్తే చర్యలు తీసుకుంటా..

అధికారులకు సీఎం చంద్రబాబు వార్నింగ్



**అమరావతి**

రైతుల వద్ద ధాన్యం సేకరణ విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఐవీఆర్‌ఎఫ్ ద్వారా రైతుల నుంచి తానే స్వయంగా అభిప్రాయాలు సేకరిస్తానని చంద్రబాబు చెప్పారు. అధికారుల నుంచి తనకు కావాల్సింది డాక్యుమెంటేషన్ కాదని, రైతులకు సేవ చేసే విషయంలో ఇంప్రూవ్‌మెంట్ కనిపించాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరు రైతు సేవా కేంద్రాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ మొదలు మిల్లులకు ఎగుమతి చేసే - మిగతా3లో



### ప్రపంచస్థాయి ప్రమాణాలతో
## యువతకు శిక్షణే లక్ష్యం

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మరో రెండు కీలక ఒప్పందాలు...

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్న ఫిజిక్స్ వాలా, టీబీఐ

మంత్రి నారా లోకేశ్ నివాసంలో ఒప్పందాలపై సంతకాలు

**అమరావతి**

అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగేందుకు అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ లో డీప్-టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ రెండు ఒప్పందాలు జరిగాయి. ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ లో -ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్.. యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. మరోవైపు, రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు - మిగతా3లో



### మానవ తప్పిదం వల్లే
## కూలిన చాపర్

- జనరల్ బిపిన్ రావత్ మృతిపై లోక్‌సభలో రిపోర్టు
- రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే.
- ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదికను తయారు చేసింది.



## అంబేద్కర్‌ని కాంగ్రెస్ అగౌరవపరిచింది

మంత్రి సత్యకుమార్ ధ్వజం

ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో సమయాన్ని వృథా చేస్తున్నారు

కాంగ్రెస్‌కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చింది

రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్‌ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్‌ని విడుదల చేశారు

"వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు.

## నన్ను పని చేసుకోనివ్వండి

అభిమానులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రిక్వెస్ట్

ఇంకా సీఎం సీఎం అంటున్నారు...


డిప్యూటీ సీఎం అయ్యాను కదా!: పవన్ కళ్యాణ్

ఉత్తరాంధ్రలో పవన్ పర్యటన

ఓ గిరిజన గ్రామంలో రోడ్డుకు శంకుస్థాపన


ఓజీ ఓజీ అంటూ జనాల అరుపులు

నన్ను పనిచేసుకోనివ్వండి అంటూ పవన్ చిరుకోపం



**విజయనగరం,**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో పర్యటించిన విషయం తెలిసిందే. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 9 గ్రామాల్లో సుమారు 50 కోట్లతో రహదారుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అయితే పవన్‌ని చూడడానికి అభిమానులు పెద్దఎత్తున్న తరలివచ్చారు. ఈ నేపథ్యంలో అభిమానులకు పవన్ రిక్వెస్ట్ చేశాడు. ఆయన మాట్లాడుతూ.. అభిమానులను నేను కోరేది ఒక్కటే. దయచేసి నన్ను నా పని చేసుకోనివ్వండి. నేను బయటికి వచ్చినప్పుడు మీరు నా మీద పడిపోతే నేను ఏ పని చేయలేను. రోడ్లు పరిస్థితి ఎలా ఉంది చూద్దాం అంటే అందరూ ఇక్కడే ఉండడంతో ఏం కనిపించట్లేదు. ఓజీ ఓజీ అని అరిస్తే పనులు జరగవు. నేను పనిచేస్తే మీ ఫ్యూచర్‌కి మంచి జరుగుతుంది. నేనున ఎక్కడికి వెళితే అక్కడ నన్ను చుట్టుముడితే నేను పనిచేయలేను. తెలుగు నేర్పించిన నేల ఇది. తిరుగుబాటు అంటే ఏంటో తెలిపిన నేల ఇది. ఇప్పుడు ఏంటంటే - మిగతా3లో





### మందిర్-మసీదు వివాదాలు
## పెరగడం ఆందోళనకరం

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్
- మన దేశం సామరస్యంగా ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉంది
- చిరకాలంగా మనం సామరస్యంతో జీవిస్తున్నాం
- ప్రపంచానికి సామరస్య సందేశాన్ని అందించాలంటే అందుకు మనం ఆదర్శంగా నిలవాలి

# పేదలందరికీ ఇళ్లు..

- ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం: నారా భువనేశ్వరి..
- వైఎస్సార్‌సీపీ హాయంలో రాష్ట్రంలో ఇండస్ట్రీలు భయపడి అన్నీ వెనక్కి వెళ్ళిపోయాయి
- చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఇప్పుడిప్పుడే పరిశ్రమలు వస్తున్నాయి
- కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుంది
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, వీధి దీపాలు, కాలువలు నూరు శాతం పూర్తి చేస్తారు



**చిత్తూరు జిల్లా:**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లాలోని కుప్పం లో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమె పర్యటన కొనసాగుతోంది. వనగుట్టపల్లిలో రచ్చబండ వద్ద మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్లతో పేదలకు అన్నం పెడుతున్నామని, పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కుప్పాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామని నారా భువనేశ్వరి అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ హాయంలో రాష్ట్రంలో ఇండస్ట్రీలు భయపడి అన్నీ వెనక్కి వెళ్ళిపోయాయని, చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఇప్పుడిప్పుడే పరిశ్రమలు వస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమం చేస్తున్నామని, నిరుపేద కుటుంబాలకు విద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఆర్థికంగా సహాయ సాకారం అందిస్తున్నామని తెలిపారు. కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, వీధి దీపాలు, - మిగతా3లో



### అలలపై
## ఇంజనీరింగ్ అద్భుతం

- అదిరిపోయే టెక్నాలజీతో వావ్ అనిపిస్తున్న దృశ్యం..!
- భారత్‌లో సముద్రంపై నిర్మించిన తొలి వంతెన పంబన్ బ్రిడ్జి.
- ఈ బ్రిడ్జిపై త్వరలోనే రైళ్ల రాకపోకలను ప్రారంభించేందుకు సర్కార్ ఏర్పాట్లు
- ఈ ప్రాజెక్టుకు రూ.550 కోట్లు ఖర్చవుతుందని అంచనా.
- ఆగస్టు 31 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యం

# ఏపీలో స్మగ్లర్లు లేకుండా చేస్తాం..

-మొదటిపేజీ తరువాయి


ప్రక్రియ మొత్తాన్నీ ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

**తేమశాతంపై ఆరా..**

ధాన్యం తేమ శాతం నమోదు, ఇతరత్రా అంశాల్లో ఎగుమతి, దిగుమతి దగ్గర ఒకేలాంటి కచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. తూకంలో హెచ్చుతగ్గులు, తేమ శాతంలో లొసుగులు వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. తేమశాతంలో ఎందుకు మార్పులు వస్తున్నాయంటూ అధికారులను సీఎం ప్రశ్నించారు. తేమ శాతం నిర్ధారణ చేసే మిషన్ పనితనాన్ని పరిశీలించారు. రైతులకు ఐవీఆర్ఎస్‌పై సీఎం అవగాహన కల్పించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు తనకు ఫీడ్ బ్యాక్ పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో ఎక్కడ తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంగూరు రైతులతో మాట్లాడి వారి నుంచి పలు అభిప్రాయాలను చంద్రబాబు తెలుసుకున్నారు.

**ఆ సమస్య వారి పొరపాటే..**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "ధాన్యం దిగుబడిలో మెకనైజేషన్ పెంచి రైతుల ఆదాయం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం. దిగుబడి పెరిగి డబ్బు సకాలంలో చేతికొస్తుండటంతో రైతులు గతేడాది కంటే ఇప్పుడు సంతోషంగా ఉన్నారు. ధాన్యం తేమ శాతం నిర్ధారణలో లోటుపాట్లు గుర్తించాం. రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతం ఒకలా ఉంటే మిల్లర్ల వద్ద మెషీన్లలో మరోలా ఉంటోంది. ఈ వ్యత్యాసం లేకుండా రెండు చోట్లా ఒకేలా మెషీన్ వాల్యూ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గోనె సంచుల సమస్య రైస్ మిల్లర్ల పొరపాటు వల్ల తలెత్తుతోందని గుర్తించాం. ధాన్యం డబ్బులు 93 శాతం రైతులకు 24 గంటల్లో చెల్లిస్తున్నాం. దీన్ని ఇంకా మెరుగ్గా అమలు చేసేందుకు సూచనలిచ్చా. డ్రయర్ల దగ్గర కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత డ్రయర్లు 23 శాతం కెపాసిటీతో మాత్రమే ఉన్నాయి.



**ఇకపై సడన్ విజిట్స్..**

ధాన్యం సేకరణ కేంద్రానికి ఇవాళ చెప్పి వచ్చినట్లు ఇకపై చెప్పి రాను. ఆకస్మిక తనిఖీలతో సడన్ విజిట్స్ పెంచుతా. సాంకేతికత సక్రమ వినియోగంతో రైతుల ఖర్చు తగ్గించి ఎక్కువ లాభం వచ్చేలా చేస్తాం. ఎలాంటి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుందనే అంశంపై వారికి అవగాహన కల్పిస్తాం. లాభసాటి వ్యవసాయంపై రైతుల భాగస్వామ్యంతో పెద్దఎత్తున చర్చలు చేపడతాం. ఐవీఆర్ఎస్ ఫిర్యాదుల్లో చెప్పినట్లే గోనె సంచుల సమస్య తీవ్రంగా ఉంది. దళారీ ముసుగులో రైతులకు ఎవరు అన్యాయం చేయాలని చూసినా ఉపేక్షించను. రాష్ట్రంలో స్మగ్లింగ్‌కి చోటు లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం అక్రమ రవాణాను అరికట్టి తీరుతాం. బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ విషయంలో కఠినంగా ఉంటామని" అన్నారు.

**అలా చేస్తే చర్యలు తీసుకుంటా..**
**అధికారులకు సీఎం చంద్రబాబు వార్నింగ్**

తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రీడింగ్ రావాలని.. కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.

రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది సీఎం చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా పండిందని రైతు వెల్లడించారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6 వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చిందని రైతు తెలిపారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని రైతు తెలిపారు. గతంలో మనుషులు కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని రైతు తెలిపారు. తొలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదని అన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకుని మనుషుల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదని చెప్పారు. ధాన్యం డబ్బుల్లో కోత లేదు.. డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందని అన్నారు. కోత మిషన్లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రోక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రోడక్టివిటీ వచ్చిందో చెప్పాలని అన్నారు. ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. సీజన్ ముందు అన్ని మిషన్లను తేమ విషయంలో క్యాలిబ్రేట్ చేస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ ప్రభుత్వం మరో ఒప్పందం చేసుకుంది.

ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది.

హబ్-అండ్-స్పోక్ మోడల్‌ను అనుసరించి ఇన్నోవేషన్ యూనివర్సిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. దీని ద్వారా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు.

**ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణే లక్ష్యం: నారా లోకేశ్**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ (ఏఐ)లో ఏపీ యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని అన్నారు. అధునాతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల డిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టిసారిస్తుందని చెప్పారు. అధునాతన సాంకేతికత, విద్యను ఏకీకృతం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్



ఎమినెన్స్ కృషి చేస్తుందని చెప్పారు. ఏఐలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలకు మార్గం సుగమం చేస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

**ఉన్నత విద్య ఆధునీకరణకు టీబీఐతో ఒప్పందం**

ఆంధ్రప్రదేశ్ లో ఉన్నత విద్య వ్యవస్థను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (%ుదీ×%)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం (%మీూఖ%)పై సంతకం చేసింది. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీ ఉన్నత విద్యలో చేయాల్సిన మార్పులపై %ుదీ×% ప్రభుత్వానికి సలహా ఇస్తుంది. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే విద్యా విధానాలను గుర్తిస్తుంది. విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో తృతీయ విద్య ల్యాండ్ స్కేప్ ను మెరుగుపర్చడానికి కృషిచేస్తుంది. ఏపీలో సమగ్ర, స్థిరమైన ఆర్థికవృద్ధి వేదిక ఏర్పాటుకు అవసరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో నైపుణ్య అంతరాలను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విధానాలను అమలుచేసేందుకు ఏపీ ప్రభుత్వంతో టీబీఐ కలసి పనిచేస్తుంది. ఇందుకు అవసరమైన సమగ్ర రోడ్ మ్యాప్ ను అభివృద్ధి చేయడంలో సహకరిస్తుంది.

# అంబేద్కర్‌ని కాంగ్రెస్ అగౌరవపరిచింది..

**విజయవాడ:** ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చిందని విమర్శించారు. ఇవాళ విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 24వ సవరణ తీసుకువచ్చి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్‌ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్‌ని విడుదల చేశారని ఫైర్ అయ్యారు. అంబేద్కర్‌ని నెహ్రూ చాలా విధాలుగా అగౌరవపరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించారని చెప్పారు.

అంబేద్కర్‌ను బీజేపీ గౌరవించింది

"అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని బీజేపీ గౌరవించింది. అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారతరత్న ఇవ్వకుండా నెహ్రూకు మాత్రం ప్రకటించుకున్నారు. అంబేద్కర్ సేవలు గుర్తించి బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించింది. అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థ్ కార్యక్రమంతో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది. కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో



చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి" అని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

వైసీపీ పార్టీ ఖాళీ..

"వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు. పార్టీలో నుంచి ముఖ్యమైన నాయకులు బయటకు వెళ్లిపోతున్నారని వారిని కాపాడుకునేందుకు జగన్ 2027లో జమిలి వస్తాయని చెబుతున్నాడు. వైసీపీ పార్టీ ఖాళీ అవ్వకుండా కాపాడుకునేందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడు. జమిలి ఎన్నికలపై కమిటీ వేశారు. కమిటీ అభిప్రాయాల మేరకు ఎప్పుడు జరుగుతాయో తెలియచేస్తారు. పార్లమెంట్‌లో బలం ఉంటే బిల్లు పెట్టాలని రూల్ లేదు. జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవ్వడంతో పాటు దేశ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుంది. రాష్ట్రాల్లో ఏదొక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పాలన పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయటంలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది" అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

**అంబేద్కర్‌ను కాంగ్రెస్ నేతలు ఇబ్బందులకు గురిచేశారు: దేవానంద్**

దళితులను ఉద్ధరించిన విధంగా, దళితుల కోసం కాంగ్రెస్ పుట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ విమర్శలు చేశారు. అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ ఓడించి అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేశారని మండిపడ్డారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాల్లో బీజేపీ అంబేద్కర్ కోసం చాలా కార్యక్రమాలు చేసిందని దేవానంద్ గుర్తుచేశారు.

## పేదలందరికీ ఇళ్లు..

-మొదటిపేజీ తరువాయి

కాలువలు నూరు శాతం పూర్తి చేస్తారని తెలిపారు.

హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి రైతులకు నీరును అందుబాటులో తెస్తారని, రైతులు పండించే పంటల కోసం కార్గో ఎయిర్‌పోర్టు విమానాశ్రయాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారని నారా భువనేశ్వరి చెప్పారు. వైఎస్సార్‌సీపీ హాయంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు గంజాయి లేకుండా యావత్ ఆంధ్రప్రదేశ్‌లోని కమిటీ ఒకటి వేశారని తెలిపారు. కరువు రహితం అనేది ఆంధ్ర రాష్ట్రంలో విజన్ 2047 ప్రారంభించారని, ఆంధ్రప్రదేశ్ ప్రశాంతంగా.. రోల్ మోడల్‌గా చేసి ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలతో సంతోషంగా ఉండాలనే మంచి ఆలోచనతో.. ధ్యేయంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారని అన్నారు. కుప్పం రుణం తీర్చుకుంటామని.. తమ కుటుంబం ఎప్పుడు ప్రజలకు కట్టుబడి ఉంటామని, టీడీపీ కార్యకర్తలను ఎప్పుడు మర్చిపోలేమని నారా భువనేశ్వరి వ్యాఖ్యనించారు.

## నన్ను పని చేసుకోనివ్వండి..

-మొదటిపేజీ తరువాయి

సినిమాల మోజులో పడి హీరోలకు జేజేలు కొట్టి మీ జీవితంలో బాధ్యతలు మర్చిపోతున్నారు. మాట్లాడితే అన్న మీసం తిప్పు అంటారు.. నేను మీసం తిప్పితే రోడ్లు పడవు.. పనులు జరగవు. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. "నన్ను పని చేసుకోనివ్వండి. కనీసం రోడ్డు కూడా కనిపించనంతగా నా మీద పడిపోయారు. మీకందరికీ దణ్ణం పెడతాను... రోడ్డు చూడనివ్వండి నన్ను అని చెప్పాల్సి వచ్చింది. ఓజీ ఓజీ ఓజీ అంటూ అరుస్తున్నారు... లేకపోతే, ఇంతకుముందు సీఎం సీఎం అనేవాళ్లు... అదింకా పోలేదు... నేను డిప్యూటీ సీఎం అయినా గానీ వాళ్లకు ఆనందం కలగడంలేదు.

అందరికీ నేను చెప్పేది ఒక్కటే... నేను వచ్చినప్పుడు అందరూ నన్ను చుట్టుముడితే పనులు జరగవు. నన్ను పనిచేయనివ్వండి. ఉత్తరాంధ్ర... ప్రజలకు తెలుగు వాడుక భాష నేర్పించిన నేల ఇది, తిరుగుబాటు నేర్పించిన నేల ఇది, ఎవరైనా దోపిడీ చేస్తుంటే ఎదురు తిరిగే నేల ఇది. కానీ ఇవాళ మీరు సినిమాల మోజులో పడి... ఓజీ ఓజీ అని పోస్టర్లు పెట్టి, జేజేలు కొడితే జీవితంలో ముందుకు వెళ్లలేరు. మాట్లాడితే చాలు... అన్నా మీసం తిప్పు, మీసం తిప్పు అంటారు. నేను మీసం తిప్పితే రోడ్ల నిర్మాణం జరుగుతుందా? నేను ఛాతీ గుద్దుకుంటే రోడ్లు పడతాయా?... నేను వెళ్లి ప్రధానమంత్రి గారికి దణ్ణం పెట్టి, సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళితే రోడ్లు పడతాయి. అందుకే, మీసాలు తిప్పడాలు, ఛాతీలు కొట్టుకోవడాలు నాకు చేతకావు... నాకు పనిచేయడమే తెలుసు" అంటూ పవన్ కల్యాణ్ అభిమానులకు హితోపదేశం చేశారు.

## వైఎస్ ఫ్యామిలీలో చిచ్చు...

**కడప :** జగన్‌కు కష్టాలు తీవ్రమయ్యాయి. ఓ వైపు పార్టీ సమస్యలు.. ఇంకోవైపు ఇంటి కష్టాలు. వీటి నుంచి బయటపడలేక నానాఇబ్బందులు పడుతున్నాడు. ఒక్కోసారి ఫ్యామిలీ సభ్యులపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పులపై లోతుగా తవ్వి తీస్తోంది కూటమి సర్కార్.ఆ గండం నుంచి బయటపడేందుకు నేతలు ఎవరిదారి వారు చూసుకుంటున్నారు.. మరికొందరైతే బెంబేలెత్తిపోతున్నారు. దీనిపై పార్టీ కూడా చేతులెత్తేయడంతో ఏం చెయ్యాలో తెలియక నేతలు, కార్యకర్తలు వలస పోతున్నారు.పార్టీలో ఎలాంటి కష్టాలు వచ్చినా కడప ప్రజలు వైఎస్ఆర్ ఫ్యామిలీని ఆదరిస్తూ వచ్చారు.. వస్తున్నారు కూడా. గడిచిన ఐదేళ్లు వైసీపీ పాలన చూసిన ప్రజలు ఈసారి రూటు మార్చారు. ఏళ్ల తరబడి జరుగుతున్న పనులు, నేతల వ్యవహారశైలి గమనించారు ప్రజలు. రీసెంట్‌గా పులివెందులలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మొత్తం కైవశం చేసుకుంది.సింపుల్‌గా చెప్పాలంటే వైసీపీ చేతులెత్తేసిందన్నమాట. పట్టుసాధించేందుకు వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి రంగంలోకి దిగినా ఫలితం లేకపోయింది. చివరకు ఫ్యాన్ పార్టీ చేతులెత్తేసింది. కడప జిల్లాలో మొత్తం 203 నీటి సంఘాలు ఉండగా, అందులో 202 సంఘాలు కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ కోట బద్దలవుతోంది.నియోజకవర్గంలో 32 సంఘాలను సైకిల్ పార్టీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ఇక అసలు విషయానికొద్దాం. ఈ క్రమంలో కడప కార్పొరేషన్‌పై కన్నేసింది టీడీపీ. దానికి వెనుక నుంచి చకచకా పావులు కదుపుతున్నారు బీటెక్ రవి. వైసీపీకి చెందిన కార్పొరేటర్లతో మంతనాలు సాగించారు.కడప జిల్లాలో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడంపై జగన్ తీవ్ర అసహనానికి గురైనట్టు తెలుస్తోంది. టీడీపీలో చేరిన 11 మంది కార్పొరేటర్లతోపాటు మరో 11 మంది గోడ దూకేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం జగన్ చెవిలో పడింది. వెంటనే అలర్టయిన అధినేత, అవినాష్‌రెడ్డికి ఫోన్ చేశారని సమాచారం.ఎవరూ పార్టీని వీడకుండా చూడాలని కాసింత గట్టిగానే చెప్పాడట. ఇంత జరుగుతున్నా.. ఇన్నాళ్లు ఏం చేస్తున్నావని మందలించారట. కడప కార్పొరేషన్ టీడీపీ చేతిలోకి వెళ్తే దాని ప్రభావం ఏపీ వ్యాప్తంగా పడుతుందని చెప్పారట జగన్. మిగతా కార్పొరేటర్లు గోడ దూకకుండా చూడాలని అవినాష్‌కు సీరియస్‌గా చెప్పారట.ఈ గండం నుంచి గట్టెందుకు తీవ్రపయత్నాలు చేస్తున్నారు ఎంపీ అవినాష్‌రెడ్డి. తనకున్న పరిచయాలతో నేతలు వెళ్లిపోకుండా చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని అవినాష్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద చెప్పివాపోయారట. ఐదేళ్లుపాటు అధికార పార్టీతో కష్టాలు పడే బదులు వలస పోవడమే బెటరని అంటున్నారు. కడప కార్పొరేషన్ వైసీపీ చేయి జారిపోతే, ఇక కూటమికి తిరుగుండదని అంచనాలు మొదలయ్యాయి. మొత్తానికి ఈ గండం నుంచి అవినాష్‌రెడ్డి ఎలా గట్టెక్కుతాడో చూడాలి

## జనసేన గూటికి ఆమంచి...

**ఒంగోలు :** చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమెహన్. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒకానొక టైంలో జిల్లా రాజకీయాలను ఏలిన నేత. కానీ ఇప్పుడు ఆయన రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. చీరాల సెగ్మెంట్లోని వేటపాలెం జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆమంచి.. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా చీరాల నుంచి పోటీ చేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2014లో నవోదయం పార్టీ అభ్యర్థిగా ఆటో గుర్తుపై రెండో సారి పోటీ చేసి చీరాలలో తిరిగి విజయం సాధించారు. తర్వాత టీడీపీలో చేరిన ఆయన.. మంత్రి పదవి ఆశించి.. అది దక్కకపోవడంతో గత ఎన్నికల ముందు వైసీపీ నీడకు చేరారు.2019 ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్థి కరణం బలరామకృష్ణమూర్తి చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కరణం బలరాం వైసీపీలో చేరడంతో.. చీరాలలో కరణం, ఆమంచిల మధ్య ఆధిపత్యపోరు తీవ్ర స్థాయికి చేరింది. వారి విభేదాలకు చెక్ పెట్టడానికి వైసీపీ అధ్యక్షుడు ఆమంచిని పర్చూరు వైసీపీ ఇంచార్జ్ గా పంపారు. అక్కడ గెలవడం కష్టమన్న భావనతో ఆమంచి తిరిగి చీరాలకు వచ్చి అక్కడ నుంచి పోటీ చేయడానికి గ్రౌండ్ వర్క్ కూడా చేశారు.అయితే చీరాల వైసీపీ టికెట్ తనకే దక్కుతుందని ధీమాతో కనిపించిన ఆమంచికి జగన్ షాక్ ఇచ్చారు. చీరాల వైసీపీ టికెట్ ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్‌కు కేటాయించి.. ఆమంచికి పర్చూరు టికెట్ ఆఫర్ చేశారు. అందుకు ఆమంచి తిరస్కరించి.. తన రాజకీయ జీవితం ఇచ్చిన చీరాలకే ఫిక్స్ అవుతానని వైసీపీకి గుడ్ బై చెప్పేశారు.?ఇక గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు ఆమంచి కృష్ణమోహన్. తన ప్రత్యర్థిని ఒడిస్తానని చెప్పి మరి చేసి చూపించారు ఆమంచి. చీరాల నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన.. నలభై వేల ఓట్లు సాధించారు. వైసీపీ తరపున పోటీ చేసిన కరణం వెంకటేశ్ ఓట్లు చీల్చడంలోనూ.. ఆయన ఓటమి లోనూ.. అమంచి చాలా కీలకపాత్రే పోషించారు. మొత్తానికి తాను అనుకున్న గోల్ అయితే రీచ్ అయిన ఆమంచి.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్నా అంత సంతృప్తిగా ఫీల్ కావడం లేదట. ఈ వ్యవహారమే ఇప్పుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా మారింది.ఆమంచి కృష్ణ మోహన్ జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇప్పటికే జనసేన పార్టీ వర్గాలతో సైతం ఆయన సంప్రదింపులు జరిపినట్లు టాక్ నడుస్తుంది. గతంతో కూడా తాను పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలు.. వైసీపీ అధిష్టానం సూచిస్తేనే మాట్లాడినట్లు పలు వేదికల్లో ఓపెన్ గానే వ్యాఖ్యానించారు. ఎలక్షన్ కి ముందు కూడా ఆయన జనసేనలో చేరతారని జోరుగా ప్రచారం జరిగింది. దాంతో మళ్లీ ఆమంచి జనసేన లో జాయినింగ్ అంటూ వాదనలు వినిపిస్తున్నాయి.మరోవైపు ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములు ఇప్పటికే జనసేన పార్టీలో యాక్టీవ్ గా ఉన్నారు. గత ఎన్నికల్లో గిద్దలూరు, చీరాల నుంచి టికెట్ ఆశించి.. కూటమి సమీకరణాల్లో పోటీ చేయకుండా ఉన్నారు స్వాములు. అయితే గత కొన్నేళ్లుగా అన్న తమ్ముళ్ల మధ్య వైరం ఏర్పడింది. వారిద్దరూ మధ్య మాటలు కట్ అయ్యాయని కూయ అంటున్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పంట కొనుగోళ్లలో రైతు ఇబ్బంది ఎదుర్కోకూడదు

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)



పంటలను కాపాడుకోవడంలో, వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించడంలో ఒక్క రైతు కూడా ఇబ్బంది ఎదుర్కోకూడదని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులు ఈ విషయాలలో సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం ఆమె ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని విక్రయించే క్రమంలో ప్రభుత్వ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురైనట్లుగానీ, వర్షాల నుండి తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి అవసరమైన టార్పాలిన్ పట్టాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని గానీ ఒక్కరైతు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 15-శాతం జిఎస్‌డిపి వృద్ధిరేటే లక్ష్యంతో అధికారులు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)



జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా 15% జిఎస్‌డిపి వృద్ధిరేటే లక్ష్యంతో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్ నందు వ్యవసాయ అనుబంధ రంగాల 15 శాతం జిఎస్‌డిపి వృద్ధిరేటే లక్ష్యం అనే అంశంపై శాఖల వారీగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో 15 శాతం జి ఎస్ డి పి వృద్ధిరేటే లక్ష్యం సాధించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అందుకనుగుణంగా లక్ష్య సాధనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే మూడు నెలల స్థిర లక్ష్యాలను సాధించడానికి మీ మీ శాఖల ఆధ్వర్యంలో మండలాలు, డివిజనల్ వారిగా నివేదికలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రతి గ్రామంలో పొలం పిలుస్తుందని కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని, రైతులను విరివిగా పాల్గొనే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి రాబోయే ఐదేళ్లలో ప్రకృతి వ్యవసాయాన్ని వృద్ది చేసేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. వ్యవసాయరంగంలో అగ్రి డీప్ టెక్నాలజీ వినియోగం పై రైతులకు పూర్తీ స్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కౌలు రైతులకు మరింత మంచి చేకూర్చేలా, అందరి సలహాలు, సూచనలు స్వీకరించి నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ పై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించి అవసరమైన మేరకు రైతులకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పంట బీమా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లలో చేపట్టిన 21వ పశుగణన కార్యక్రమాన్ని 2025 జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మంజురైన మినీ గోకులం షెడ్స్ ను డ్వామా శాఖ వారితో సమన్వయం చేసుకొని సంక్రాంతి నాటికి పూర్తీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం కింద జిల్లాలో 2426 లక్ష్యం కాగా, 9084 జారీచేసి, రుణం కింద 82.73 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1200 ఎకరాల్లో పశు గ్రాసం పెంచేలా లక్ష్యం కాగా 748.26 ఎకరాల్లో ఇప్పటి వరకు పశు గ్రాసం పెంచడం జరిగిందని, 62.36 శాతం లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. లక్ష్యం మేరకు మిగిలిన ఎకరాల్లో పశుగ్రాసం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కల్లెక్టర్ అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, నిర్దేశించిన విధంగా వృద్ధి రేటు సాధించేలా మత్స్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని అందుకనుగుణంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటి (అప్సడా) యాక్ట్ కింద మత్స్య కారులందరిని రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖ అధికారులు తప్పని సరిగా ప్రతి వారం మత్స్య గ్రామాలకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి మంచి అవకాశం ఉందని, అందుకనుగుణంగా ఉద్యాన సఖ అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోటెన్షియల్ ఏరియాను గురించి ఉద్యాన పంటల అభివృద్ధి పై రైతులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వున్న అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలల్లో డిజిటలైజేషణ్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, సహకారశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుక్ష్మ సేద్యం విధానాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై పవర్ పాయింటం ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ బేబి రాణి, ఆర్టికల్చర్ అధికారి గోపి చంద్, ఏపీ ఎంఐపి పిడి రమణ, జిల్లా సహకారశాఖాధికారి శ్రీనివాసులురెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య భీమా పథకంను ప్రతి జర్నలిస్టు సద్వినియోగం చేసుకోవాలి

## వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, డిశంబర్ 20)

జర్నలిస్ట్ లు ఆరోగ్య భీమా పథకంలో నమోదై సద్వినియోగం చేసుకోవాలని యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. జర్నలిస్టులు చెల్లించాల్సిన మొత్తంలో 50% ఆర్థిక కవరేజీని తానే చెల్లిస్తానని తెలిపారు. జర్నలిస్ట్‌ల సంక్షేమం వైసీపీ బాధ్యతని అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. (తరువాయి 4లో...)

# జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తా

## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

### జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నూతన ఆసుపత్రి నిర్మాణ పనులకు భూమిపూజ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)



పోలీసుల సంక్షేమం, పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం వారి సహకారంతో శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ నూతన పోలీస్ హాస్పిటల్ నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా వారికి అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్యం, వైద్య పరీక్షల కోసమే ఈ హాస్పిటల్ నిర్మించడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి అందుబాటులో ఉంటుందన్నారు. పోలీసులు రాత్రింబవళు పని చేయడంతో పాటు ప్రతిరోజు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ అధిక ఒత్తిడిని గురవుతున్నారని, పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విధులు సమర్థంగా నిర్వహించగలరన్నారు. పోలీసులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, తరచూ హెల్త్ చెక్-అప్ చేయించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తరచూ ఉచిత హెల్త్ క్యాంపు లు, ప్రతి వారము స్పెషలైజ్ డాక్టర్‌లను యూనిట్ హాస్పిటల్ లకు పిలిపించటం జరుగుతుందని, మానసిక ఉల్లాసం కొరకు క్రీడల నిర్వహిం చామని, సిబ్బందికి ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే నేరుగా పోలీస్ యూనిట్ హాస్పిటల్ లో సంప్రదించి తగిన వైద్య సేవలను పొందాలని 4

# 70 మంది పాస్టర్లకు వస్త్రాలు అందించిన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్





4



## ఆరోగ్య భీమా పథకంను ప్రతి జర్నలిస్టు సద్వినియోగం చేసుకోవాలి

అనంతరం ఆయన మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత కవరేజీ అందుతుందన్నారు. మీ మీద ఆధారపడిన కుటుంబ సభ్యులను చేర్చడం, డిపెండెన్సీ స్వభావం తప్పనిసరిగా నిబంధనలు, షరతులకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రణాళికాబద్ధమైన చికిత్స అయినా, అత్యవసర శస్త్రచికిత్స అయినా లేదా బిడ్డను కలిగి ఉన్నా, ఇన్‌పేషెంట్ సేవలు నిజంగా ఖర్చులను పెంచుతాయని కవరేజ్ చాలా విలువైనదన్నారు. చికిత్స తరువాత 30 రోజుల పాటు డిశ్చార్జ్ తర్వాత కవరేజ్, హాస్పిటల్ బస నుండి కోలుకునే సమయంలో ఫాలో అప్ అపాయింట్‌మెంట్‌లు, మందులు లేదా చికిత్స కవర్ చేయబడతాయన్నారు. అర్హులైన జర్నలిస్ట్‌లు నమోదు ప్రక్రియను ప్రారంభించడానికి సంబంధిత జిల్లా ప్రజా సంబంధాల అధికారిని కలవాలని, సంప్రదించిన తర్వాత, దరఖాస్తుదారు రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన వివరాలను అందించాలని అన్నారు. శని, ఆదివారాల్లో ఈ ఇన్సూరెన్స్ నమోదును జర్నలిస్ట్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్‌లుగా తాము చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ఎమ్మెల్యే చెల్లిస్తున్నందుకు నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## 70 మంది పాస్టర్లకు వస్త్రాలు అందించిన టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 20)**
క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పొదిలి పట్టణంలోని చర్చి నందు పొదిలి, కొనకనమిట్ల మండలాలకు చెందిన 70 మంది పాస్టర్లకు శుక్రవారం టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, ఆయన సోదరుడు నిరంజన్ చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జి ఏలియా, శామ్యుల్ శేఖర్, కె జాన్ బెన్ని, ఆర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తా







సూచించారు. హాస్పిటల్ నిర్మించటానికి ముందుకు వచ్చిన కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం వారికి జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, హాస్పిటల్ సీవోవో కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారధి, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## పంట కొనుగోళ్లలో రైతు ఇబ్బంది ఎదుర్కోకూడదు



స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అధికారులు మరింత చురుకుగా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకుని వచ్చారో, ఇంకెంత రావాల్సి ఉందనే అంశాలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. కాగా, జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును సివిల్ సప్లై డి.ఎం. వరలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్కు వివరించారు. ఈ నెల రెండో వారం నాటికి 216, మూడవ వారం నాటికి 564 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.1.41 కోట్ల నగదును రైతులకు చెల్లించినట్లు తెలిపారు.జిల్లాలోని రేషన్ దుకాణాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను జనవరి 15 నాటకి భర్తీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ బియ్యానికి సంబంధించిన అక్రమాలపై 6(ఏ) కేసులు నమోదు చేస్తున్న తీరుపై ఆమె ఆరా తీశారు. ఈ దిశగా నమోదు చేసిన కేసుల వివరాలను డి.ఎస్.ఓ. పద్మశ్రీ కలెక్టర్ కు వివరించారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేషన్ బియ్యం ఎట్టిపరిస్థితులలోనూ పక్కదారి పట్టరాదని స్పష్టం చేసినందున క్షేత్రస్థాయిలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిఘా పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే వారి వెన్నులో వణుకుపుట్టేలా రైస్ మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపిఎంఐపిపిడి పివి రమణ, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, ప్రకృతి సేద్యం డిపిఎం సుభాషిణి, మండల వ్యవసాయ అధికారులు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్ ఛార్జిలు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటి తహాశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కనిగిరి డిఎస్పీ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)**
సాధారణ బదిలీలో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన కనిగిరి సబ్ డివిజన్ డిఎస్పీ యం మహేశ్వరరావు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి సబ్ డివిజనల్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. కనిగిరి సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డిఎస్పీ గారికి ఎస్పీ గారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు సబ్- డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల కట్టడి,సైబర్ నేరాలపై అవగాహన ,ఇతర అంశాలపై నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.

## టీడీపీలో చేరిన ముత్తుకూరు వైసీపీ నేతలు

### ఆత్మీయ ఆహ్వానం పలికిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)**
తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు కాకుటూరు లక్ష్మణరెడ్డి, ముత్తుకూరు ఉప సర్పంచ్ కాకుటూరు అనితారెడ్డి, వార్డు సభ్యులు కావలి సుజాత, రొయ్యల శకుంతల, షేక్ ఆస్తాతో పాటు కాకుటూరు విజయమోహన్ రెడ్డి, రవిదేవారెడ్డి, కిషోర్, పాముల నాగరాజు, వెల్లంపల్లి సూరిబాబు, సురేష్, తిరుపతి రావ్, కృష్ణయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## కేంద్రమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలి

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 20)**
రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంటే కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షాకు ఎందుకంత భయం అని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు . కేంద్ర హెూం శాఖ మంత్రి పార్లమెంట్లో అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు . ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బిజెపి పార్టీ మొదటినుండి కూడా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. దీనంతటికీ కారణం రిజర్వేషన్లు ఎత్తివేయాలని రాజ్యాంగాన్ని మార్చివేయాలనేటువంటి కుట్రతో వ్యవహరిస్తున్న బిజెపి తీరును భారతదేశంలో ఉన్న ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. వెంటనే అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## ప్రతి గృహానికి, దేవాలయాలకు సైరన్ లాక్(స్మార్ట్ లాక్) ఉపయోగించండి

### సీఐ సంగమేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, డిశంబర్ 20)**
నేటి సమాజం ఎంత అభివృద్ధి చెందుతుందో, అదేవిధంగా దొంగలు కూడా వాళ్ల నైపుణ్యాన్ని కొత్త కొత్త టెక్నాలజీతో ఇళ్లల్లో, గుడిలో దొంగతనాలు చేస్తూ పోలీస్ సిబ్బందికే సవాల్ విసురుతున్నారని సిఐ సంగమేశ్వర రావు దొరవారి సత్రం పోలీస్ స్టేషన్లో జరిగిన మీడియా సమావేశంలో తెలియజేశారు.గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు మీరు ఎక్కడికైనా ప్రయాణమై వెళ్లేటప్పుడు మీ యొక్క గృహాలకు సైరన్ లాక్ వేసి ఇంట్లో ఉన్న నగదు గాని బంగారు ఆభరణాలు గాని భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ సైరెన్ లాక్ విలువ రూ.400 ఉంటుందని, ఈ లాక్‌ను ఇళ్లకు, దేవాలయాలకు, ఉపయోగించుకొని దొంగల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలోని దేవాలయాలకు, గృహాలకు ఇటువంటి సైరెన్ లాక్‌ను ఉపయోగించుకొని పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## నేడు 'మెగా ఫుడ్స్'

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 20)**
శనివారం 'మెగా ఫుడ్స్ వైభవంగా నిర్వహిస్తున్నామని వాసవి విద్యాసంస్థ అధినేత కే రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 210 రకాల వంటకాలను మా విద్యార్థులు ప్రదర్శించ బోతున్నారు. అన్ని రక్తాల వంటకాలను దికే చోట వీక్షించడం చాలా అరుదు. ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు వైపుణ్య అభివృద్ధి కలుగును. ఈ మెగా ఫుడ్ ఫెస్ట్ ద్వారా పౌష్టికార విలువలు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు తెలుసుకొని ఆరోగ్య పరంగా సూచన చేసుకోగలరు.

## ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



**(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, డిశంబర్ 20)**
ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని వరదయ్యపాలెం మండల తహశీల్దారు రాజశేఖర్ స్పష్టం చేశారు.శుక్రవారం మండలం లోని పాండూరు లో గ్రామ సర్పంచ్ రెడ తొట్టి కవిత కిష్టయ్య అధ్యక్షతన రెవిన్యూ సదస్సు జరిగింది. ముఖ్య అతిధిగా మండల టీడీపీ అధ్యక్షులు యుగంధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రదానంగా భూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వము రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. సదస్సులు రెవెన్యూ దేవాలయ భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లు మార్పు, సరిహద్దు సమస్య, చుక్కల భూములు పరాదినం వంటి పలు సమస్యల పై వినతలు సమర్పించుకోవచ్చును అన్నారు. అనంతరం పలు సమస్య లపై ప్రజలు వినతలు సమర్పించారు. అనంతరం తహశీల్దారు వివరణ పాండూరు రెవిన్యూ లో ప్రధానగా జీరో ఖాతాలో భూమి ఉన్న వారు ఎక్కువగా ఉన్నందున ఈ సమస్యపై ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ దృష్టి కి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. అదేవిధంగా సదస్సు లలో ప్రజల వద్ద నుండి వచ్చిన ముటేషన్,ఎఫ్ లైన్, ఇంటి పట్టాలు,ఇంటి స్థలాలు,కొత్త రేషన్ కార్డులు,పేర్లు మార్పులుపై పరిశీలించి ప్రజలు ఇచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు అన్ని విధాలుగా సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. అదే విధంగా పాండూరు కొత్త దళిత వాడకు చెందిన గ్రామస్తులు స్మశాన దారి వివాదంపై ఇచ్చిన ఫిర్యాదు పై సర్వేచేసి దారి ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ నాగరాజు, ఫారెస్ట్ అధికారి రెడ్డెప్ప, మండల సర్వేయర్ వెంకట రమణ, ఎంపీటీసీ అంకమ్మ చిన్నయ్య, చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ కె సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయుకులు ప్రతాప్‌రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రీ బర్త్‌డే షూట్స్

### న్యూ బోర్న్, మేటర్నిటి షూట్ ఆల్సోకి అందమైన హరివిల్లు ది నెల్లూరు కిడ్స్ స్టూడియో

### జనసేన నాయకులు గునుకుల కిషోర్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)**
జనసేన క్రియాశీలక సభ్యుడు లోచన్ ఇస్కాన్ సిటీ కృష్ణ మందిరం ఎదురుగా నూతన స్టూడియో ప్రారంభోత్సవానికి అందుబాటులో లేక రాలేనందున శుక్రవారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల స్టూడియోని సందర్శించారు. సినిమా స్టూడియోను తలంపించే విధంగా అధునాతన సౌకర్యాలతో అన్ని హంగులతో ప్రీ బర్త్‌డే, జస్ట్ బోర్న్, మెటర్నటీ ఫోటో షూట్‌కి అనుగుణంగా రూపొందించింది. నెల్లూరులో వెనక క్లాత్ వేసి అట్మాస్ఫియర్ క్రియేట్ చేస్తారు. ఇక్కడ ఇంటీరియల్‌తో పాటు పిల్లలకు కావలసిన దుస్తులు కూడా అందుబాటులో తీసుకొని వచ్చారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరారు.




## శ్రీసిటీ కంపెనీ బస్సు యాజమాన్యానికి సూళ్లూరుపేట సిఐ సూచన

**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, డిశంబర్ 20)**
శ్రీ సిటీ నుండి వివిధ కంపెనీలకు చెందిన ఉద్యోగస్తుల ప్రయాణించే బస్సులు సూళ్లూరుపేట టౌన్‌లోకి తీసుకు వచ్చే బస్సు ఆపరేటర్స్‌తో మీటింగ్ ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట టౌన్‌లో బస్ పార్కింగ్, అదేవిధంగా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా బస్సులు నడపాలని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 23వ తేదీ అంటే సోమవారం నుండి ప్రయోగత్మకంగా 10రోజుల పాటు చెంగాళమ్మ టెంపుల్ వైపు నుంచి కాకుండా హెూలీ క్రాస్ జక్షన్ నుండి సూళ్లూరుపేట లోకి కంపెనీ బస్సులు ఎంట్రీ ,ఎగ్జిట్ లాంటి విషయాలు పై చర్చించడం జరిగింది. పై కార్యక్రమంలో సూళ్లూరుపేట సిఐ, శ్రీసిటీ సిఐ, సూళ్లూరుపేట ,తడ ఎస్ఐలు, శ్రీసిటీ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్, బస్సు ఆపరేటర్స్ పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవిన్యూ సదస్సులు

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, ఈ రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపట్నం మండలం, గాదెపాలెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సునకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరై భూ సమస్యల పై వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత సమస్యల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎక్కువ శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని, ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్నీ రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులను రెవెన్యూ సదస్సులవద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో కుల దృవీకరణ సర్టిఫికేట్ కొరకు, ప్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి



పరిశీలన చేసి సంబంధిత సర్టిఫికెట్స్‌ను జిల్లా కలెక్టర్, సంబంధిత అర్జీదారులకు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మి ప్రసన్న, తహశీల్దార్ మధుసూదన్‌రావు, రెవిన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపట్నం మండలం, కె. పల్లెపాలెం గ్రామంలో చేపడుతున్న సిసి రోడ్ల పనులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. కె పల్లెపాలెంలో 2.06 కోట్ల రూపాయలతో 4.53 కి.మీ మేర 46 పనులు చేపట్టడం జరిగిందని, అందులో 2.12 కి.మీ మేర 20 పనులు పూర్తి కావడం జరిగిందని పంచాయతీ రాజ్ ఈఈ శ్రీ కోటేశ్వర రావు జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మిగిలిన పనులు సంక్రాంతి నాటికి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మి ప్రసన్న, డ్వామా పిడి జోసఫ్ కుమార్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ టొబాకో వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 20)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం 2024లో భాగంగా "అంతర్జాతీయ టొబాకో వ్యతిరేక దినోత్సవాన్ని" ప్రిన్సిపల్ డా. జి.ఎల్. సుధారాణి అధ్యక్షతన కరేడు పిహెచ్‌సి, ఇంక్లూజివ్ సెంటర్ వారు నిర్వహించారు. ఐ. క్యు. ఎ.సి. కోఆర్డినేటర్ డా. సి.హెచ్. మాణిక్యరావు, కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ ఎస్ హరిత గారు మరియు ఇంక్లూజివ్ సెంటర్ కోఆర్డినేటర్ డా. ఎం. బాబురావు కార్యక్రమం గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రస్తుత యువత పొగాకు ఉత్పత్తులు మత్తులో తమ విలువైన బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు కాబట్టి యువత ఈ విషయాలలో ఎంతో జాగ్రత్త వహించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరేడు పీహెచ్సీ మేల్ ఎం.పి.హెచ్ అల్తాఫ్ గారు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల అనేక రకాల క్యాన్సర్ బారిన పడకుండా తమ భవిష్యత్తును యువత కాపాడుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఏఎన్ ఎం సులోచన, ఆశ వర్కర్ సుజాత పాల్గొన్నారు.

# భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలి

### మురగళ్ల బూత్ కన్వీనర్ తోడేటి అశోక్



(షణ్ముఖ వెలుగు, ఆత్మకూరు, డిశంబర్ 20)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా ఆత్మకూరు ఎస్ వి ప్రజావైద్యశాల ఎండీ, వింజం దోరసానమ్మ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ప్రణీత్ ఎంపికయ్యారు. కాగా డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్‌ను మురగళ్ళ బూత్ కన్వీనర్ తోడేటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి డాక్టర్ ప్రణీత్‌ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మీరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మిమ్మల్ని ఈ పదవికి ఎంపిక చేసిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు, ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కి, నియోజకవర్గ ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభగిరిపట్నం మాజీ సర్పంచ్ కాకు పెంచలయ్య హఠాన్మరణం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)

ప్రభగిరిపట్నంలో పెంచలయ్య భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. రెండు రోజుల క్రితం కూడా తన కార్యాలయానికి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించిన పెంచలయ్య ఇంతలోనే కానరాని లోకాలకు చేరడంపై ఆవేదన వ్యక్తం చేశారు సోమిరెడ్డి. పెంచలయ్య మరణం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# మార్కాపురంలో యువకుల భారీ ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 20)

మార్కాపురం పట్టణంలో డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి హెల్మెట్ అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. తదుపరి పట్టణ వీధుల్లో యువకులు భారీ ఎత్తున హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఏ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సైదుబాబు, రూరల్ ఎస్ఐ అంకమ్మరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 20)




ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయం కందుకూరులో స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టి వి ఎన్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఒక్క స్కూల్ బస్ డ్రైవర్, ఆటో డ్రైవరు రోడ్ సేఫ్టీ రూల్స్‌ను తప్పనిసరిగా తూచా తప్పకుండా పాటించాలని ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు వెహికల్ స్టార్ట్ చేసేటప్పుడు చుట్టుపక్కల చూసి జాగ్రత్త వహించి ముందుకు వెళ్లాలని, అదేవిధంగా ఓవర్ స్పీడ్ వెళ్లకుండా మరియు సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ డ్రైవింగ్ చేయకూడదని తెలియజేశారు. ముఖ్యంగా 60 సంవత్సరములు దాటిన డ్రైవర్ సోదరులు స్వచ్ఛందంగా స్కూల్ బస్సులు నడుపుకుండా ఉండాలని తెలియజేశారు. ముఖ్యంగా మీ మీద మీ కుటుంబం ఆధారపడి ఉంటారు మీ నిర్లక్ష్యంతో కుటుంబాన్ని రోడ్డున పదవెయ్యద్దని మీ నిర్లక్ష్యమే యముడికి ఆయుధం కనుక ప్రతి ఒక్క డ్రైవర్ సోదరులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా ఉండగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోటార్ వాహనముల తనిఖీ అధికారి శ్రీ చెన్నూరి రాంబాబు గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని ఉంటారని అదేవిధంగా స్కూల్ బస్సు నడుపు డ్రైవర్లు ,బస్సు నందు అటెండెంట్ ఉండి స్కూల్ పిల్లలు వాహనము ఎక్కినప్పుడు దిగునప్పుడు ముందు వెనక గమనిస్తూ ఎవరూ లేరని గమనించుకున్న తర్వాత వాహనమును ముందుకు వెళ్లేలా చూసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా స్కూల్ బస్సు నడుపు డ్రైవర్లు యూనిఫామ్ కూడా ధరించి డ్రైవ్ చేయాలని ముఖ్యంగా స్కూల్ పిల్లలు తీసుకొని వచ్చి మరల తిరిగి వారి యొక్క గమ్యస్థానము నకు చేర్చు బాధ్యతవహిస్తున్నారు కాబట్టి అతి జాగ్రత్తతో వాహనమును నడుపుతూ వారిని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఎవరైతే బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపిన అట్టి వారిపై చర్యలు తీసుకోబడునని తెలియజేశారు.



# మేయర్ గంగాడ సుజాత నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన

### ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బియన్ విజయ్ కుమార్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత నివాసంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, ఆయన సతీమణి నాగసత్యలత, సంతనూతలపాడు ఎమ్మెల్యే బియన్ విజయకుమార్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేలను, నియోజకవర్గాల ఇంచార్జ్‌లను, కార్పొరేటర్ లను మేయర్ దంపతులు శాలువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా మేయర్ నివాసంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని క్రిస్మస్ పర్వదినం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని దామచర్ల జనార్ధన్ రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ, నగర్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, దర్శి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి , ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, జనసేన నాయకులు కంది రవిశంకర్,జిల్లా అధ్యక్షులు రియాజ్, డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబు, నగర కార్పొరేషన్ ఉప మేయర్ వేమూరి సూర్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నగర పార్టీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి బండారు మదన్, ఎద్దు శశికాంత్ భూషణ్, పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, పలువురు కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళా నాయకులు ఆర్ల వెంకటరత్నం, నిడమనూరి పావని, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పై హోంమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండించండి

### అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

### ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

భారత హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో మాట్లాడుతూ పదే పదే అంబేద్కర్ పేరు చెప్పుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. అన్ని సార్లు దేవుడు పేరు స్మరించి ఉంటే వారికి ఏడు జన్మలకు స్వర్గంలో స్థానం దక్కదని" అత్యంత దుర్మార్గంగా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను నిర్లక్ష్యం చేసిందని పేరుతో అంబేద్కర్‌ను అవమానించాడు. దీనిని నిరసిస్తూ ఈరోజు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఒంగోలులోని హోటల్ కోలాస్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. హోం మంత్రి అమిత్ షా భారత పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, హోం మంత్రి పదవి నుండి తొలగించాలని హోం మంత్రిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు.

పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ "హిందూ కోడ్ " బిల్లును న్యాయశాఖ మంత్రిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్లమెంటులో బ ప్రవేశపెట్టినప్పుడు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఆర్ఎస్ఎస్ పెద్ద ఎత్తున అంబేద్కర్ పై విరుచుకుపడిందని, దేశవ్యాప్తంగా సాధువులతో నిరసనలు తెలియజేసి బిఆర్ అంబేద్కర్ భారతీయ కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాడని విమర్శించారని, నేడు ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్ కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం కావడంతో ఆర్ఎస్ఎస్,బిజెపి శక్తులు ఒకవైపు బిఆర్ అంబేద్కర్ పై కపట ప్రేమను, గౌరవాన్ని ప్రకటిస్తూ మరోవైపు తమ అసలు స్వరూపాన్ని, ఆలోచనను ప్రచారం చేస్తున్నారని, అంబేద్కర్ ను అవమానకరంగా మాట్లాడుతున్నారని అందువలన దళిత,ప్రజాస్వామ్య విప్లవశక్తులు ఏకమై సమైక్యంగా హిందూ ఫాస్టేస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాలు డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవద్ సుబ్బారావు, ఐఎల్‌పి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి బి పద్మ, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలన్న, జిల్లా అధ్యక్షులు వి రామ్మోహన్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు శ్యామ్,కార్యదర్శి జే.వెంకటేష్, నగర అధ్యక్షులు వి కోటి, ఏఐకేఎంఎస్ సీనియర్ నాయకులు కొంగర నరసింహం, పేరయ్య, మున్నంగి లక్ష్మయ్య, దారా సుబ్బారావు, హనుమంతరావు, తదితర దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

# నారాయణ క్యాంప్ కార్యాలయంలో ముందస్తు ఫ్రీ క్రిస్మస్ సంబరాలు

## కేక్ కట్ చేసిన మంత్రి నారాయణ సతీమణి రమాదేవి
## ప్రత్యేక ప్రార్ధనలు చేసిన క్రైస్తవ సోదర సోదరీమణులు
## ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు









**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)**
నెల్లూరు నగరం గోమతి నగర్‌లోని మంత్రి నారాయణ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఫ్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె క్రైస్తవ సోదరీమణులు, చిన్నారులు, 28వ డివిజన్ల టీడీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రమాదేవి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి బైబిల్ మార్గం చూపించిందన్నారు. సమానత, శాంతికోసం ఏసుక్రీస్తు జీవితాంతం శ్రమించారని తెలిపారు. ఆధునిక సమాజంలో నెలకొన్న అసమానతలు, అశాంతికి ఏసుక్రీస్తు, పరిష్కర మార్గం చూపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధతో పాటు మాజీ జెడ్పిటిసి విజేతరెడ్డి, జనసేన మహిళలు నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# కోస్టల్ వెస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ సందర్శన



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనతో పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనతో పర్యావరణం కాపాడటం ఒక పెద్ద చాలెంజ్‌గా తీసుకుని పని చేస్తున్నారని ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ అనేక పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాలను ఇక్కడ సేకరించి వాటిని ట్రీట్మెంట్ చేసి పర్యావరణం దెబ్బతినకుండా కాపాడుతారు అని తెలిపారు. టి.ఎస్. టీ.ఎఫ్.ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన భావితరాలకు మంచి వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ బాధ్యత గా తీసుకుంది అని తెలిపారు. ఇలాంటి ప్లాంట్స్ మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పర్యావరణం కాపాడుతమనీ తెలిపారు రాబోయే తరాల వారికి మంచి పర్యావరణం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటి సారి ఒక కొత్త ఆలోచనా విధానంతో సాంకేతికంగా ఆలోచించి ముందుకు పోతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే, కూరుగుండ్ల రామకృష్ణ ,పీసీబీ అధికారి అశోక్ కుమార్, ఏపీఎంసిల్ జిఎం వెంకటేశ్వర్లు,చెన్ను తిరుపాల్ రెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ హైవేస్ పాలసీ పై ఎంపీ మాగుంట ప్రశ్న



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)**
దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో గత 5 సంవత్సరాలలో గ్రీన్ హైవే పాలసీ (జాతీయ రోడ్లపై మొక్కలు నాటే విధానం) క్రింద ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు, నిధులు, అవగాహన కార్యక్రమాలు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి, నితిన్ జైరాం గడ్కరి సమాధానమిస్తూ గ్రీన్ హైవే పాలసీ వలన కాలుష్యం ,ప్రమాదాలు తగ్గునని, అందరి భాగస్వామ్యంతో హైవేల కారిడార్ల పచ్చదానాన్ని ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యమని, "వార్షిక మొక్కల కార్యాచరణ ప్రణాళిక" ప్రకారం దేశంలోని జాతీయ హైవే రోడ్ల ఇరువైపుల మరియు మధ్య మొక్కలు నాటడం జరుగుచున్నదని తెలిపారు. గత 5 సంవత్సరాలలో దేశంలో రూ.322.68 లక్షల చిన్న మొక్కలు నాట బడగా, ఆంధ్రప్రదేశ్ లో 9.51 లక్షలు, మరియు ప్రకాశం జిల్లాలో 59,436 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. మొత్తం 62,660 కిలో మీటర్ల మేర మొక్కలు నాటే పని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఖచ్చితమైన ఉపాది - లబ్దిదారుల సంఖ్య లేనప్పటికీ, మొక్కల నాటడం, నర్సరీల అభివృద్ధి, నిర్వహణ ,సంబందిత కార్యకలాపాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా గణనీయంగానే ఉద్యోగావకాశాలు ప్రధానంగా గ్రామీణ ప్రజలకు కల్పించబడుచున్నాయని, దీంతో సామాజిక ఆర్థిక అభివృద్ధి కూడా జరుగుచున్నదని తెలిపారు. 2018-19 నుండి 2024-25 వరకు రూ.602.42 కోట్లు కార్యక్రమాల క్రింద ఖర్చు చేయబడిందని, "ఏక్ పెడ్ మా కే నాం" ప్రచారంతో 17-09-2024 ఒక్క రోజే 21,773 మంది ప్రజలతో 1,58,762 మొక్కలు నాటడం జరిగిందని మరియు చిన్న నేలలు, పట్టణాలలో రద్దీ ప్రదేశాలలో, ధార్మిక ప్రదేశాలలో మరియు బ్రిడ్జీల క్రింద కూడా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టబడుచున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

# పేదల ఆకలి తీర్చేందుకు రేషన్ బియ్యం పథకం

## పేదల కంటే రేషన్ మాఫియాకే ఎక్కువ ఉపయోగం



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, చేజర్ల, డిశంబర్ 20)**
నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలోతెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం మాట్లాడుతూదేశంలోని మొదటి సరిగా స్వర్గీయ నందమూరి తారక రామారావు రెండు రూపాయలకు కేజి బియ్యం పథకాన్ని మన రాష్ట్రంలో 1983 లో ప్రవేశ పెట్టారు. 1992 నుండి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దేశ వ్యాప్తంగా బియ్యం అందిస్తుంది. పేదల ఆకలి తీర్చేందుకు ఈ పథకం ద్వారా బియ్యం పంపిణీ కొరకు ఏడాదికి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లకు త్ పైగారాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుంది . పేదల ఆకలితెర్చేందుకై ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పథకం పేదల కంటే రేషన్ మాపియాకే ఎక్కువ ఉపయోగపడుతుంది. ఈ పథకం క్రింద కేజీ బియ్యానికి ప్రభుత్వం రూ43 ఖర్చు చేస్తుంటేదానిలో పేదలకు రూ10 చేందుతుంటేరేషన్ మాఫియాకు రూ 33 చేరుతుంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రేషన్ బియ్యం మాఫియా విజృభించింది. వైసిపి అయిదు సంవత్సరాల కాలంలో దాదాపు 1.30 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని ఒక అంచనా. పేదలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయలు మాఫియా జేబుల్లోకి వెళుతున్న ఈ పథకం పై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేసిఈ పథకంలో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రేషన్ కార్డు దారులకు అప్షన్ ఇచ్చి బియ్యం కావాలనే వారికి బియ్యం ఇచ్చి,బియ్యం వద్దు అన్న వారికి కేజీ కి రూ43 నగదు బదిలీ చేసే అంశాన్ని కూడా ప్రభుత్వాలు పరిశీలించాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేదని చెపితేస్వచ్చందంగా కార్డులను వదులుకునే వారు చాలా మంది ఉన్నారు. ఈ అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి రాష్ట్రంలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటుఈ పథకం అమలు పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లోతైన అధ్యయనం చేసి చట్టాల్లో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏడాదికి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్న ఈ పథకం నిజమైన లబ్దిదారులకు ఉపయోగపడే విధంగా అక్రమాలకు తావులేకుండా ఉండే విధంగా కొత్త చట్టాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వంకు విజ్ఞప్తి చేస్తున్నాం.

# అమిత్ షాని మంత్రి పదవి నుంచి భర్త రఫ్ చేయాలి

## దళిత హక్కుల పోరాట సమితి
## ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 20)**
కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు అమిత్ షా కేంద్ర మంత్రి పదవిలో పనిచేస్తూ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంటూ పదేపదే అంటారు దానికి బదులుగా దేవుడా దేవుడా అని ఒకసారి అనండి మీకు పుణ్యం ప్రాప్తిచ్చి స్వర్గానికి వెళ్తారు అన్ని పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గము ఆలోచించండి ఒక కేంద్ర మంత్రిగా ఉండి రాజ్యాంగ పదవులు అనుభవిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ని అవహేళన చేయడం సిగ్గుమాలిన చర్యని దేశ ప్రజలకు ఎటువంటి సందేశం ఇస్తున్నారని రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటారు కొత్త రాజ్యాంగాన్ని ప్రారంభిస్తామంటారు మనస్మృతిని ప్రవేశపెడతామంటారు దేశంలో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని దేశద్రోహం కేసును నమోదు చేసి ఈ దేశ పౌరసత్వాన్ని రద్దు చేయాలని అన్నారు, ప్రపంచంలోనే అత్యంత గౌరవించదగ్గ వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని వారిని అవహేళన చేస్తే బహుజనులు చూస్తూ ఊరుకోరని అన్నారు, మీ కుంచిత బుద్ధిని పక్కనపెట్టి దేశ ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని అన్నారు దేశ ప్రధాని అయిన నరేంద్ర మోడీ మీ క్యాబినెట్లో ఇటువంటివారు మంత్రులుగా కొనసాగడం సిగ్గుచేటని వారిని సమర్థిస్తున్న మీలాంటివారు ఇంకా సిగ్గుపడవలసినటువంటి అవసరం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాలవరయ్య, మాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శాంతరాజు, వాల్మీకి సంఘం నాయకులు నర్సింహులు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్ష కార్యదర్శులు కోటికల బాలబాదుర్ల కోటపాటి రమణ రిటైర్డ్ ఉపాధ్యాయులు పందిటి కొండ చిన్నయ్య, పలుకూరి భాస్కర్, దారా కొండయ్య, వార్త విలేఖరి కుందుర్తి వెంకటేశ్వర్లు, దమ్ము శ్రీను, జొన్నలగడ్డ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఈ దుర్ఘటనకు బాధ్యులెవరు?

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)**
చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం నందు పనిచేస్తున్న సిద్దయ్య శెట్టి పరీక్ష పేపర్స్ పాఠశాలకు తీసుకు వెళ్తూ మధ్యాహ్నము రంగంపేట వద్ద ప్రమాదానికి గురి కావడం జరిగింది. సిద్దయ్య శెట్టి తలుపులపల్లి జెడ్పిహెచ్‌ఎస్ స్కూల్ నందు బయలాజికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. సిద్దయ్యశెట్టి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం జరిగింది. ఈ సంఘటనకు నిరసనగా యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి ని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు సంయుక్తంగా మాట్లాడుతూ పేపర్ లీక్ కాకుండా చూసుకోవడం పూర్తిగా ప్రభుత్వం బాధ్యత మాత్రమే అవుతుంది కాని అది ఉపాధ్యాయుల తప్పిదం కాదన్నారు. ప్రభుత్వం భవిష్యత్‌లో పరీక్ష పేపర్స్ ను పాఠశాలకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, అదే విధంగా ప్రభుత్వ అధికారులు కక్ష పూరిత ధోరణి మానుకోవాలని జిల్లా శాఖ పక్షాన కోరారు.

# శక్తి సదన్‌కు రాజేంద్ర ప్రసాద్ దుస్తులు, కుర్చీలు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)**
ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి నిర్వహిస్తున్న ఒంగోలులోని హౌసింగ్ బోర్డ్ లో ఉన్న శక్తి సదన్ లో క్రిస్మస్ సందర్భంగా ప్రముఖ కవి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ గారు శక్తి సదన్ హెూములోని పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది.. ఆ సందర్భంగా ఈ సభకు సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. కవి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాలు అందరికీ శుభదినాలని ఆ సందర్భంగా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.. అంతేకాక పిల్లలు పెద్దవారు చదువుకోవటానికి వీలుగా కుర్చీలు పంపిణీ కూడా చేశారు. తేళ్ల అరుణ మాట్లాడుతూ శక్తి సదన్ కుల మతాలకతీతంగా అన్ని పర్వదినాలు నిర్వహించడం జరుగుతుందని అందరూ సమానం అనే స్ఫూర్తిని క్రిస్మస్ అందించిందని తెలియజేశారు.. ఇంకా ఈ సభలో సమితి కోశాధికారి బీరం అరుణ, అందులో పనిచేసే ఉద్యోగులు సిహెచ్ కనకదుర్గ ,గుంటుపల్లి. శ్రీదేవి ,మలాన్ భాను, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు

# పలువురిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్







**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిశంబర్ 20)**
జె పంగులూరు మండలం జాగర్లమూడి వారిపాలెంలో తెదేపా సీనియర్ నేత తెలగతోటి రాధాకృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈరోజు వారి నివాసానికి వెళ్లి రాధాకృష్ణను పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు. అదేవిధంగా జాగర్లమూడివారిపాలెం మాజీ సర్పంచ్ జాగర్లమూడి వాయునందనరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే ధూళిపాళ్ల సుబ్బారావు ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకోగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## నూతన డిఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన పామూరు సిఐ భీమా నాయక్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిశంబర్ 20) కనిగిరి నూతన డీఎస్పీగా మల్ల మహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పామూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ భీమా నాయక్ డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందచేసి శు భాకాంక్షలు తెలియజేశారు.

## చెత్తను తొలగించేందుకు కొత్తగా కాంపాక్టర్ వాహనాలు






(షణ్ముఖ వెలుగు, విజయవాడ, డిశంబర్ 20)

మున్సిపాల్టీల్లో చెత్తను తొలగించేందుకు కొత్తగా కాంపాక్టర్ వాహనాలు కొనుగోలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా శుక్రవారం విజయవాడ మున్సిపాల్టీ కోసం ఏర్పాటు చేసిన ప్రయోగాత్మక వాహనాన్ని మంత్రి నారాయణ విఎంసి కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి డెమో వాహనాన్ని పరిశీలించారు. 14 టన్నుల చెత్తను తరలించేలా అత్యాధునిక టెక్నాలజీతో వాహనం రూపొందించిన వాహనం ఇది అన్నారు. మున్సిపాల్టీల్లో చెత్త తొలగింపు కోసం అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## హెూం మంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడటం సిగ్గు చేటు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

భారత రాజ్యాంగ నిర్మాత పీడిత ప్రజల ఆశాజ్యోతి ఈ యుగం సూర్యుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అవమాన కరంగా మాట్లాడటం సిగ్గు చేటు అని, తక్షణం అమిత్ షా జాతికి క్షమాపణ చెప్పి అంబేద్కర్ గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని, కేంద్ర కేబినెట్ నుండి అమిత్ షా ని వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఒంగోలు అంబేద్కర్ గారి విగ్రహం ముందు నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కొండపి ఇన్చార్జి యం బుద్ధకోటి, ఒంగోలు నుండి బత్తుల అశోక్, కనపర్తి కొండల్, అశోక్, రమేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఔరంగాబాద్ సర్పంచ్ మృతి



(షణ్ముఖ వెలుగు, కంభం, డిశంబర్ 20) కంభం మండలంలోని ఔరంగాబాద్ గ్రామంలో సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న వరికుంట్ల కళావతి శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న



గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జునరెడ్డి (మాజీ ఎమ్మెల్యే మార్కాపురం) మృతురాలు కళావతి (సర్పంచ్) ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు వైసీపీ నాయకులు గొంగటి చెన్నారెడ్డి (కన్వీనర్), నెమలిదిన్నె చెన్నారెడ్డి (మాజీ మార్కెట్ యార్డు చైర్మన్), మండల సర్పంచులు, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు.

# భూ సంబంధిత సమస్యలు... సత్వర పరిష్కారం దిశగా చర్యలు

## సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్లు
## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
## అద్దంకి రెవెన్యూ సదస్సులో మంత్రి గొట్టిపాటి రవికుమార్





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిశంబర్ 20)

గత ప్రభుత్వ అధికార దుర్వినియోగం, అస్తవ్యస్థ పాలనతో ఏర్పడ్డ భూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా అద్దంకిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అత్యధిక శాతం ప్రజల నుంచి భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు రావడంతో వాటిని శాశ్వత ప్రాతిపదికన వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది భూ సంబంధిత సమస్యలను పరిష్కరించి.. అర్హులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



**రెవెన్యూ అధికారులతో సమావేశం**

భారీగా తరలి వచ్చిన ప్రజల నుంచి అర్జీల స్వీకరణ అనంతరం సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు, వీఆర్వో లతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమావేశం నిర్వహించారు. మొత్తం ఎన్ని వినతులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని నమోదు చేసి, వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలనీ, సమస్య పరిష్కారం అయ్యే వరకూ అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలతో పాటు విద్యుత్, ఇతర శాఖలకు సంబంధించిన వినతుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

**రూ. 1.26 కోట్ల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ. 1,26,71,093 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను 111 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదే విధంగా రూ. 29,80,000 విలువైన ఎల్ ఓ సీ లను ఆరుగురు అర్హులకు అందించారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్న మంత్రి



గొట్టిపాటి... ఇప్పటి వరకు అద్దంకి నియోజక వర్గంలో సుమారు రూ. 3,68,74,641, సిఎంఆర్ఎఫ్ నిధులను బాధితులకు అందించినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయంలో సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగానే వున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**రూ. 2.60 కోట్ల సిఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్లు...**

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద... సామాజిక బాధ్యతగా.. అద్దంకి నియోజకవర్గ పరిధిలో విద్యుత్ శాఖ కు చెందిన సుమారు రూ. 2.60 కోట్లతో... 11 కమ్యూనిటీ హాళ్లను, ఒక కళాశాల భోజన శాలను నిర్మిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ కాలనీలలో ఎక్కువగా ఈ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వ హయంలో మధ్యలోనే నిలిచిపోయిన కొన్ని నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాల వ్యాప్తంగా వక్ఫ్ స్థలాల స్థితిగతులు పొందుపరచండి

### 32 వేల ఎకరాలు అన్యాక్రాంతం కావటానికి కారణాలు తెలపండి
### ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20) ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ వక్ఫ్ బోర్డ్ సీఈఓ, 26 జిల్లాల ఇన్స్పెక్టర్ ఆఫ్ ఆడిటర్స్ తో నెల్లూరు లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. గతంలో వక్ఫ్ బోర్డ్ అధికారులు బాగా పని చేసి ఉంటే ఇంకా బాగా పనిచేయాలని, బాగా పనిచేయకపోయి ఉంటే ఇకపై బాగా పని చేయాలని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్లు నిజాయితీగా పనిచేయాలని, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాల వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల స్థితిగతులను పొందుపరచాలని, ఉన్న వక్ఫ్ ఆస్తులతో సంపద సృష్టించడానికి తీసుకోవాల్సిన చర్యలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ముందుగా మిగిలి ఉన్న వక్ఫ్ స్థలాలు అన్నిటికీ జియో ట్యాగింగ్ చేయాలని, 32 వేల ఎకరాల వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం కావడానికి గల కారణాలను తెలపాలని అధికారులను ఆదేశించారు. సెంట్ భూమిని సైతం రికార్డ్‌లలో పొందుపరచాలని అన్నారు.

## మెప్మా ఆధ్వర్యంలో జీవనోపాధుల జాతర వర్క్ షాప్






(షణ్ముఖ వెలుగు, విజయవాడ, డిశంబర్ 20)

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. శుక్రవాహం మెప్మా ఆధ్వర్యంలో జీవనోపాధుల జాతర వర్క్‌షాప్‌ను మంత్రి నారాయణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మెప్మాలోని లక్ష మంది మహిళలతో ఎంఎస్ఎంఈల ఏర్పాటు చేశామన్నారు. తలసరి ఆదాయం పెంపు కోసం వంద రోజుల ప్రణాళిక రూపొందించామన్నారు. ఇంటికొక వ్యాపారవేత్త ఉండాలనే సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. మెప్మా ప్రొఫైలింగ్ యాప్ ద్వారా ఇప్పటివరకూ 90 శాతం మంది సభ్యుల మ్యాపింగ్ పూర్తి చేసామన్నారు. మహిళలకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో మెప్మా సిబ్బంది బాగా పనిచేయాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో మున్సిపల్‌శాఖ కార్యదర్శి కన్నబాబు, మెప్మా ఎండీ తేజ్ భరత్, జిల్లాల పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'వీర్ బాల్ దివాస్' ను ఘనంగా నిర్వహించాలి

### బాబా జోరావర్ సింగ్, బాబా ఫతేసింగ్ లను ఆదర్శంగా తీసుకోవాలి
### ఈ నెల 21 నుంచి 26 తేది వరకు 'వీరు బాల్ దివాస్' ను ప్రతి పాఠశాలలో నిర్వహించాలంటూ బిజెపి నేతల వినతి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, డిశంబర్ 20)

బాల్యంలోనే దేశం కోసం ధర్మం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన బాబా జోరవర్ సింగ్, బాబా ఫతేసింగ్ లు నేటి విద్యార్థులకు ఆదర్శంగా తీసుకోవాలని ఈ అంశాన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ,అధ్యాపకులు వారికి తెలియజేయాలని ఈనెల 21తేది నుంచీ 26న వరకు జరిగే 'వీర్ బాల్ దివాస్ 'ను జిల్లాలోని అన్ని పాఠశాల యందు నిర్వహించాలని కోరుతూ ఈ మేరకు శుక్రవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, బిజెపి జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ ,బిజెపి యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్ నాయుడు లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావుకి వినతి పత్రాన్ని సమర్పించారు.. భారత ప్రభుత్వం బాల్ వీర్ దివాస్ కి చెందిన గెజిట్ పత్రాన్ని ఆయనకు అందించారు. జిల్లాలోని అన్ని పాఠశాలందు విద్యార్థినీ విద్యార్థులకు' వీర్ బాల్ దివాస్ ' గురించి తెలియజేసి వారి త్యాగస్ఫూర్తిని అర్థమయ్యేలా విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ వేడుకలను భారత ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారన్నారు.

## జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన కొండ్రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)

నెల్లూరు నగరంలో నూతనంగా నిర్మించిన జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైనది. నెల్లూరు నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాని క్యాంపు కార్యాలయం ఎదురుగా నూతన జిల్లా వైసీపీ కార్యాలయంను నెల్లూరు జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఆనం అరుణమ్మగారు ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ మంత్రి పి.అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కిల్లివేటి సంజీవయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయ కుమార్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు వీరి చలపతిరావు, నగర పార్టీ అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి తదితరుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు, అభిమానుల అధికసంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో ఏకతాటిపై రావడం ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి పార్టీ ముఖ్య నాయకులు నియామక పత్రాలను అందించారు.








# ఆత్మను బలపరచగల పవిత్ర గ్రంథం భగవద్గీత జనసేన నాయకులు గునుకుల కిషోర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)

గీత వైభవ్ ట్రస్ట్ ద్వారా గత నాలుగు సంవత్సరాల నుంచి గీతా జయంతి నిర్వహిస్తూ భగవద్గీతను చదువుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరికి ఉందని ప్రతి ఇంటికి,ప్రతి స్కూల్ కి తిరిగి పవిత్ర భగవద్గీత శ్లోకాలను పిల్లలకు అధ్యయనం చేయిస్తున్న నిర్వాహకులు పూజ్య శ్రీ నజీర్ భాషా , జయలక్ష్మి ,తదితర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో.... డిసెంబర్ 11 గీతా జయంతి నాడు పిల్లలకు పరీక్షలు ఉండడం వల్ల నేడు నెల్లూరు దర్గామిట్ట నందుగల అష్టలక్ష్మి టెంపుల్ ప్రాంగణంలో గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత ఆరాధకులు హిందూ మద్దతు దారులు పాల్గొని పిల్లలచే పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించారు. అనంతరం మత గురువుల సందేశాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భగవద్గీత పఠించాలని,పిల్లలకు నేర్పించాలని తెలిసినా ప్రస్తుత పరిస్థితుల్లో బిజీ లైఫ్ లో ఎవరికీ కుదరటంలేదు.ఇటువంటి సమయంలో ఆ బాధ్యతను భుజాల మీద వేసుకొని నడుస్తున్న గురువులు గీతా వైభవ్ ట్రస్ట్ నజీర్‌కు, సభ్యులకు పేరుపేరునా అభినందనలు తెలుపుతున్నాను.మా చిన్నప్పుడు రంగనాయకుల స్వామి టెంపుల్ వద్ద భగవద్గీత ప్రతి ఆదివారం బోధించేవారు మేము కూడా వెళ్ళే వారము.తర్వాత కాలంగుణంగా భగవద్గీతను గురించి చదవాలన్న



ఆవశ్యకతను అప్పుడప్పుడు పేపర్లో చూస్తాము కానీ ఆచరణ సాధ్యం కాలేదు... దీని ముందుకు తీసుకెళ్తున్న కమిటీ మెంబర్లకు అభినందనలు.దాదాపు 5500 సంవత్సరాల ముందు అన్నదమ్ములతో, బంధుమిత్రులతో ఏ విధంగా తలపడాలని సంసయిస్తూ ఉద్వేగానికి గురైన అర్జునుడికి ధర్మో రక్షిత రక్షితః రక్షిత ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది లోక కళ్యాణార్థం ధర్మం గెలిచేందుకు పోరాడాలని అందుకు అనుకూలమైన శక్తిని భగవద్గీత శ్లోకాలు ద్వారా కృష్ణ పరమాత్ముడు తెలిపిన మహత్తర సందేశమే భగవద్గీత.మన భారతదేశం స్వతంత్ర భారతదేశం అన్ని మతాలకు,అన్ని కులాలకు ఆచరించగలిగే స్వేచ్ఛను సమానత్వాన్ని కలిగి!ఉంది అది మన దేశ గొప్పతనం.భగవద్గీత గొప్పది సనాతన ధర్మం గొప్పది అంటున్నారే కానీ ఇతరుల మతాలను దూషించట్లేదు. గురువులు నజీర్ ముస్లిం మతస్థులు అయినప్పటికీ భగవద్గీత యొక్క సారాన్ని తెలుసుకొని దాన్ని తత్వాన్ని ప్రజలకు తెలియజేస్తూ చిన్నప్పటి నుంచి పిల్లలకి నేర్పించడం నిజంగా అభినందినయం.వారి కార్యాచరణ ముందుకు నిర్విరామంగా సాగాలని కోరుకుంటున్నాను.కీర్తిశేషులు భాస్కర్ రెడ్డి గారు పతంజలి యోగా సెంటర్లో ఓంకార దని యొక్క వైబ్రేషన్ ని ,యోగా ద్వారా అనేక రుగ్మతలను రూపుమాపగలమన ఎన్నో సంవత్సరాలు సమాజ సేవ చేశారు.తదనంతరం వారి సేవలను కొనసాగిస్తున్న వారి సతీమణి



జయలక్ష్మి గారు ఇందులో సభ్యులు కావడం ఈ కార్యాన్ని ముందుకు తీసుకెళ్లడం లో వారు మఖ్య పాత్ర వహించటం అభినందనీయం.సనాతన ధర్మాన్ని కాపాడే వారందరూ ఒకచోట చేరి సాంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాల తో హిందుత్వాన్ని ముందుకు తీసుకెళ్తుంటే కనులు పండుగగా ఉంది.ఎంతోమందిని పిలిచాము ఏ రాజకీయ నాయకుడు కూడా ఈ కార్యక్రమానికి మద్దతు తెలపడం లేదని నిర్వాహకులు నాతో తెలిపారు ఇటువంటి మహత్తర కార్యాన్ని వీక్షించేందుకు అందులో భాగస్వామ్యం అవ్వడానికి అదృష్టం ఉండాలి.మనది సనాతన ధర్మం ఆ సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ గారు ఎన్నో ఎంతో శ్రమిస్తున్నారు. ఇటువంటి మహాతర కార్యక్రమానికి నా వంతు సహాయ సహకారాలు నా భాద్యత నిరంతరం అందజేస్తాను.పరమత సహనం నాకు పుట్టుకతో భారతదేశం నేర్పించింది. మన సనాతన ధర్మం మాకు గొప్పది ఇతర మతాలను గౌరవిస్తూ దానిని కాపాడుకుందామని తెలుపుతున్నాను.సనాతన ధర్మం గురించి నిర్భయంగా భాహటంగా మాట్లాడగలిగిన ఒకే ఒక నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారే... సనాతన ధర్మ పరిరక్షణ దేశవ్యాప్తంగా బోర్డు ఏర్పాటు చేయాలని సంకల్పం నెరవేరాలని కోరుకుందాం అని తెలిపారు.

## నీటి సంఘం అధ్యక్షుడిగా భూసాని నాగరాజు శుభాకాంక్షలు తెలిపిన యాగంటి మల్లికార్జునరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల, డిశంబర్ 20)

మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలో ఉన్న 650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మాచర్ల నియోజకవర్గం లోనే అతిపెద్ద చెరువుకి ఏకగ్రీవంగా నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన పోలేపల్లి గ్రామానికి చెందిన భూసాని నాగరాజు కి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించిన మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు,మాట్లాడుతూ ఆత్మకూరు చెరువుకి సంబంధించి గ్రామాలకు త్రాగు నీరు, చెరువు పరిధిలో నున్న పంట పొలాలకి సక్రమంగా నీళ్లు అందించాలని మరియు ఎండాకాలంలో కూడా చెరువులో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు నీరు వృధాగా పోకుండా కట్ట పటిష్టంగా ఉండేలా నీరు వృధాగా పోకుండా ప్రతి నీటి బొట్టుని పంట పొలాలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి మాజీ సర్పంచ్ భూసాని మల్లయ్య, వెంకటరెడ్డి, అనంత రామయ్య, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరావు, దుర్భాగులు ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నేతాజీ హై స్కూల్ విద్యార్థులకు నేషనల్ తైక్వాండో పోటీల్లో ప్రథమ బహుమతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

ఒంగోలు రైలుపేట రెండో లైన్లోని శ్రీ నేతాజీ హై స్కూల్ విద్యార్థులు గోలి సాయి మహేష్, గోలి సాయి హర్షలు నేషనల్ టైక్వాండో పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా స్కూల్లో జరిగిన అభినందన సభలో కరస్పాండెంట్ సిహెచ్ మల్లికార్జునరావు మరియు ప్రిన్సిపల్ అనుపమాలు విద్యార్థులను, కోచ్ శివలను అభినందించారు. ఈ సందర్భంగా టీచర్స్ మాట్లాడుతూ పిల్లలను చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా కబడ్డీ పోటీల కరపత్రాలు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 20)

విద్యార్థి యువజన జేఏసీ ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ప్రకాశం జిల్లా కబాడీ పోటీల్ని కరపత్రాలను ప్రారంభించిన ప్రకాశం జిల్లా కబాడీ అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి ,జిల్లా విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్ , జిల్లా కబాడీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్ర భాస్కర రావు గారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సిరిగిరి రంగారావు ,మద్దిపాడు మండల టిడిపి నాయకులు దాసరి రమేష్ , 22 ,23 తేదీలను దర్శి నియోజకవర్గంలో సామంతపూడి గ్రామంలో జరుగుతుందన్నారు. మొదటి, రెండో,మూడో బహుమతులు ప్రధానం చేయబడుతుందన్నారు. కార్యక్రమ ఆర్గనైజర్స్ మరియదాసు, బెంజిమెన్ పాల్గొన్నారు.

## నెల్లూరు నగర నియోజకవర్గంలో ఘనంగా జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 20)

వైసీపీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గ వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు, కార్యకర్తలు, అబిమానులకు విజ్ఞప్తి చేశారు. మన ప్రియతమ నాయకులు, వై. ఎస్. జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా నెల్లూరు నగరం, రాంజీ నగర్, 3వ వీధి, చిల్డ్రన్ పార్క్ రోడ్డు నందుగల నెల్లూరు నగర నియోజకవర్గ వై.ఎస్.ఆర్.సి.పి కార్యాలయము నందు, ఉదయం 10 గంటల నుండి పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్, పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో జన్మదిన వేడుకలు నిర్వహించబడుతుందన్నారు.అఈ కార్యక్రమములో కేక్ కటింగ్, రక్తదాన శిబిరము ,ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్యక్రమానికి హాజరై మన ప్రియతమ నాయకుని జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## మద్యం షాపును తొలగించండి





(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, డిశంబర్ 20)

వలేటివారిపాలెం మండలంలోని పోకూరు అంబేద్కర్ నగర్ ప్రక్కనే ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్‌ల ఆధ్వర్యంలో ఈరోజు కందుకూరు ఎక్సైజ్ ఆఫీసులో ఎక్సైజ్ వెంకట్రావుకి వినతిపత్రం ఇచ్చారు. అంబేద్కర్ నగర్ కాలనీవాసులంతా కూలినాలి చేసుకుని తన కుటుంబాలను పోషించుకోవలసి వస్తుందని, కాలనీ ప్రక్కనే మద్యం షాప్ ను ఏర్పాటు చేస్తే వచ్చిన కూలి డబ్బులు ఎంత మద్యం షాప్ కే దళితులంతా సమర్పించాల్సి వస్తుందని ప్రజాసంఘాల నాయకులు జీవీబీ కుమార్, ఆ గ్రామ ఎంపీటీసీ గౌరవ సలహాదారులు నూక తోటి వీరనారాయణ లు సిఐ కి వివరించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన షాపు మహిళలు బహిర్భూమికి వెళ్లే ప్రదేశంలో ఏర్పాటు చేశారని, మద్యం బాబులు ఆగడాలు మహిళలపై పెరుగుతాయనిపేర్కొన్నారు. ఆ ప్రక్కనే చర్చి కూడా ఉందని తెలిపారు. ఈపాటికే ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని స్థానిక శాసనసభ్యులకు కూడా విన్నవించుకున్నామని తెలిపారు. కాలనీ ప్రక్కనే కాకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన సీఐ 20 రోజులలోఅక్కడ నుండి మరో ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాలనీవాసులు తోపాటు కెవిపిఎస్ నాయకులు పర్రే భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్, చేవూరు లోకేష్, తదితరులు ఉన్నారు.

## కనిగిరి ఎస్సీ కాలనీలో క్రిస్మస్ సెలబ్రేషన్స్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 20)

కనిగిరి నగరంలో పాతూరులో గల ఎస్సీ కాలనీలో క్రైస్తవులు అంగరంగ వైభవంగా ముందస్తు క్రిస్మస్ పండగ సందర్భంగా ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఒక్క కుటుంబంలో పండగ వాతావరణంలా, ప్రతి ఒక్క ఇంట సంతోషాలతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు ఆలూరి రోమ బ్రదర్స్ తెలిపారు.

## ఉండేల వారి నిశ్చితార్థ వేడుకలో వైసీపీ ఇంచార్జి దద్దాల





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 20)

కనిగిరి పట్టణంలో ఉండేల శ్రీను కుమార్తె నిశ్చితార్థం వేడుకలో కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి, పిసిపల్లి జడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకే రెడ్డి,వెలిగండ్ల నాయకులు పల్నాటి భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోబ్బిళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## భీమవరంలో దోమల మందు పిచికారి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 20)

మండలంలోని భీమవరం గ్రామంలో దోమల మందును శుక్రవారం గ్రామ సర్పంచ్ మేడిద రాజమ్మ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల శ్రేయస్సు కోసమే దోమల మందు పిచికారి చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి రమణయ్య, గ్రామ నాయకులు మేడిద నాగేశ్వరరావు, జి చలపతి, కె వెంకట రామరాజు, యం కోటిరెడ్డి, కార్యదర్శి ఏ అంజయ్య, ఎస్‌కె నవీద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం మాల్యాద్రికి శుభాకాంక్షలు తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 20)

కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన వలేటివారిపాలెం మండలం, నూకవరం గ్రామ నివాసి గుర్రం మాల్యాద్రి నెల్లూరు జిల్లా టెలికాం బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన శుభ సందర్భంగా కందుకూరు పట్టణంలోని గుర్రం మాల్యాద్రి పొగాకు కంపెనీ నందు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. గుర్రం మాల్యాద్రికి టెలికాం బోర్డు అడ్వైజరీ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేశారు. గుర్రం మాల్యాద్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శులు దువ్వూరి రమేష్ చంద్ర, కసుకుర్తి నవరత్నం, ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్, ఆలూరి ఆనంద్, కందుకూరు నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు జడ రవీంద్రబాబు, తదితరులు ఉన్నారు.

## 28న జననీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 20)




జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్వర్యంలో 28న మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అమరావతి గ్రౌండ్స్‌లో ఈ శిబిరం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 08402 272727, 7095601555 ను సంప్రదించాలన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com